# బతుకమ్మ చీరలు బంద్

- చీరల పంపణీని నిలిపివేసిన కాంగ్రెస్ సర్కారు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఆడబిడ్డలు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆడబిడ్డల కోసం ప్రతి ఏడాది కోటి బతుకమ్మ చీరల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. పండుగ సమీపిస్తున్నా ఇప్పటి వరకు చీరల పంపిణీ ఊసే లేదు. కనీసం కానుకలు ఇచ్చే అంశం కూడా తెరపైకి రాలేదు. దీంతో ఆడబిడ్డలు మనోవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే బతుకమ్మ చీరల పంపిణీకి మంగళం పాడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పంపిణీ రాష్ట్రంలో పండుగలా సాగేది. ఉచిత చీరలతో బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకునేవారు.

**ఆర్డర్లు లేక నేతన్నల ఇక్కట్లు..**

బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నేత కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడాది చీరల తయారీ కోసం ఆర్డర్లు లేకపోవడంతో రాష్ట్రంలోని నేతన్నల జీవితాలు ఛిద్రమవుతున్నాయి. నేత కార్మికులు మళ్లీ ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నారు. గత సీఎం కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో చేనేత కార్మికులు అన్ని విధాలా అభివృద్ధి చెందారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

**గత ప్రభుత్వం కేటాయించిన నిధులు..**

| సంవత్సరం | నిధులు(కోట్లలో) |
| --- | --- |
| 2017 | 222.48 |
| 2018 | 280.00 |
| 2019 | 313.00 |
| 2020 | 317.81 |
| 2021 | 333.14 |
| 2022 | 339.73 |
| 2023 | 351.52 |
| మొత్తం | 2157.68 |

2017 నుంచి 2023 వరకు ప్రతి ఏడాది దాదాపు కోటి మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. చీరల తయారీకి ఏడాదికి దాదాపు రూ.300 కోట్లకు పైగానే మొత్తం రూ.2,157 కోట్లు కేటాయించింది.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

## 33 శాతం వాటా ఇవ్వాల్సిందే

- రాష్ట్ర ప్రభుత్వం కోతపెడితే ఊరుకోం: మిర్యాల రాజిరెడ్డి
- పలుచోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

గోదావరిఖని, సెప్టెంబర్ 24: సింగరేణి కార్మికుల లాభాల వాటాలో కోతపై టీబీజీకేఎస్ నిరసనల్లో భాగంగా మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో జరిగిన నిరసనలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ప్రకటించిన రూ.4,701 కోట్ల లాభాలపై 33 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

## అక్టోబర్ 9న సింగరేణి కార్మికులకు బోనస్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): సింగరేణి యాజమాన్యం కార్మికులకు అక్టోబర్ 9న లాభాల్లో బోనస్ చెల్లించనున్నది. వచ్చే నెల వేతనంతో పాటు దసరా అడ్వాన్స్‌గా కార్మికుల ఖాతాల్లో జమచేయనున్నది. సింగరేణి సీఎండీ బలరాం మంగళవారం అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సింగరేణి డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలతో నిర్వహించిన సమావేశంలో విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశించారు. లాభాల వాటా కింద మంజూరు చేసిన రూ. 796 కోట్లలో సంస్థలోని 42 వేలమంది కార్మికులు, ఉద్యోగులకు సగటున రూ.1.90 లక్షల చొప్పున బోనస్ దక్కనున్నది. 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేల చొప్పున అందజేయాలని నిర్ణయించింది.

## సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడు

**సీపీఐ నిర్వహించిన సంతాపసభలో వక్తల నివాళి**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మార్క్సిస్టు పార్టీ దిగ్గజం, పేద ప్రజల గొంతుక, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికంగా దూరం కావడం వామపక్షాలతోపాటు దేశ క్షేమాన్ని కోరుకునే వారికి తీరని నష్టమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి సంతాపసభను సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సభలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పలువురు సీపీఐ నేతలు ప్రసంగించారు. సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని వివరించారు. అంతకుముందు ఏచూరి జీవిత చరిత్ర పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.

**హైడ్రాపై శ్వేతపత్రం ఇవ్వాలి : కూనంనేని**

చెరువులు, ప్రభుత్వ భూములపై సర్వే చేపట్టి, ఇందులో పేదలు, పెద్దల నిర్మాణాలు, పట్టాలు ఉన్నవారు ఎంతమంది ఉన్నారో ఒక శ్వేతపత్రం విడుదలచేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రాతో పేదలు బలి కాకుండా చూడాలని కోరారు. ఈ అంశంపై పాలసీని రూపొందించాలన్నారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ ఇండ్లు

- 16 వేల గృహాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు
- రివర్‌బెడ్, బఫర్‌జోన్‌లో ఉన్నవారికి పునరావాసం
- సర్వేలో 10,200 మంది నిర్వాసితులుగా గుర్తింపు
- పేదల ఇండ్లు కూల్చితే మరోచోట ఇండ్లివ్వాలని ఉదయమే మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్
- ఖాళీ ఉన్న 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లు నిరుపేదలకు ఇవ్వాలని సూచన
- సాయంత్రంలోగా గృహాలు కేటాయించిన సర్కారు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : మూసీ నది అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, హైదరాబాద్ మెట్రో రైలు అంశాలపై జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్‌లో ఉన్న వారికి పునరావాసం కల్పించేందుకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తారు. ఇప్పటికే అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎక్కడెక్కడ ఇండ్లను కేటాయించారో తెలియజేస్తారు. ముందుగా రివర్ బెడ్‌లో ఆక్రమణలో ఉన్న 1600 ఇండ్లను తొలగించి అక్కడివారిని తరలిస్తారు. మూసీ బఫర్ జోన్‌లో నిర్మాణాలకు పరిహారం చెల్లిస్తారు. నిర్మాణ ఖర్చుతో పాటు, పట్టా ఉంటే భూమి విలువను పరిహారంగా ఇస్తారు. డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా కేటాయిస్తారు. మూసీ నిర్వాసితులకు చట్ట ప్రకారం పునరావాసం కల్పిస్తామని సీఎం ఇదివరకే ప్రకటించారు.

**ఉదయం కేటీఆర్ డిమాండ్.. సాయంత్రంలోగా సర్కార్ స్పందన**

'పేదలే దిక్కులేక నాలాలపై ఇండ్లు కట్టుకుంటరు.. మానవత్వం ఉన్న ప్రభుత్వమైతే తొలుత వారికి నోటీసులివ్వాలి.. లేదంటే వారికి వేరేచోట ఇండ్లు ఇవ్వాలి.. మేము కట్టిన 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లున్నయి. వాటిని పేదలకు ఇవ్వాలి' అని మంగళవారం ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేయడంతో పాటు పలు సూచనలు చేశారు. సాయంత్రం వరకు మూసీ నిర్వాసితులకు 16వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

**ఆక్రమణల వివరాలివ్వండి : సీఎం**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి, వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించాలని, ఆక్రమణల వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని చెప్పారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగవతం చేయాలని, మెట్రో మార్గాల్లో భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే పరిష్కరించాలని సూచించారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట మెట్రో విస్తరణ అంశాలను వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్ పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధంచేసి కేంద్రానికి సమర్పించాలని స్పష్టంచేశారు. సమీక్షలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీకి.. అంబేద్కర్ వర్సిటీ స్థలం

- పదెకరాలు కేటాయించిన సర్కారు
- మండిపడుతున్న బీఆర్ఏఓయూ ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, సంఘాలు వద్దని ఎంత వారించినా..ప్రభుత్వం వీటిని లెక్కచేయకుండా బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పదెకరాలను ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి కేటాయించింది. అది అత్యంత గోప్యంగా.. రహస్యంగా. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఏఓయూకు చెందిన పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మంగళవారం రెండు వర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. వర్సిటీకి స్థల కేటాయింపు విషయాన్ని ఇటీవలే 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ ప్రతిపాదనలను బీఆర్ అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి, నిరసన ప్రదర్శనలు సైతం నిర్వహించాయి. ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. కానీ వాటిని లెక్కచేయకుండా సర్కారు మంగళవారం స్థలాన్ని కేటాయిస్తున్నట్టు రెండు వర్సిటీలకు లేఖ రాసింది. ఈ నిర్ణయంపై విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, టీచర్లు, సిబ్బందిని సమీకరించి జేఏసీగా ఏర్పడి త్వరలోనే ఆందోళనను తీవ్రతరం చేస్తామని బీఆర్ఏఓయూ ఉద్యోగులు హెచ్చరించారు. ఒక్క ఇంచు స్థలాన్ని కూడా వదులుకోబోమని స్పష్టంచేశారు.

## ఏపీ వద్దే విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ఫండ్

- పక్క రాష్ట్రంలో మూలుగుతున్న రూ.3,392 కోట్లు
- తెలంగాణలోని రిటైర్డ్ ఉద్యోగుల అగచాట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన జరిగిన పదేండ్లు పూర్తయినా ఇప్పటికీ పలు అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. వాటిలో విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ఫండ్ ఒకటి. రాష్ట్ర విభజన సమయంలో నెలకొన్న సందిగ్ధత వల్ల విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ నిధులన్నీ ఏపీకే వెళ్లాయి. దీంతో తెలంగాణకు చెందిన రూ.3,392 కోట్లు పక్క రాష్ట్రంలో మూలుగుతున్నాయి. ఏపీ జెన్‌కో నుంచి రూ.2,478 కోట్లు, ఏపీ ట్రాన్స్‌కో నుంచి రూ.914 కోట్లు రావాల్సి ఉన్నది. కానీ, ఆ నిధులను ఇవ్వకుండా ఏపీ పేచీకి దిగుతున్నది. ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించినా దాటవేస్తున్నది. దీంతో ఈ భారం తెలంగాణ విద్యుత్తు సంస్థలపై పడనున్నది. 2004కు ముందు విద్యుత్తు సంస్థల్లో నియమితులైన ఉద్యోగులకు పెన్షన్‌ను వర్తింపజేస్తున్నారు. ఆ తర్వాత నియమితులైనవారికి సీపీఎస్ విధానం అమలవుతున్నది. తెలంగాణలోని విద్యుత్తు సంస్థల్లో ఈ ఏడాది మార్చి నుంచి ఉద్యోగుల రిటైర్మెంట్లు మొదలయ్యాయి. దీంతో వారికి పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించాల్సి ఉన్నది. కానీ, ఏపీ నుంచి పెన్షన్ ఫండ్ రాకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్తు సంస్థలు చేతులెత్తేశాయి. దీంతో రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగులకు అగచాట్లు తప్పడం లేదు. పెన్షన్ ఫండ్‌ను వెనక్కి తెప్పించాలని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

## 98 మందితో ఉద్యోగ జేఏసీ కార్యవర్గం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధనకు ఏర్పడిన తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గం కొలువుదీరింది. 98 మంది తో కూడిన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని జేఏసీ నేతలు మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రకటించారు. ఇప్పటికే జేఏసీ చైర్మన్‌గా మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావును ఎన్నుకున్నా రు. తాజాగా అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ స్థితప్రజ్ఞను నియమించారు. కో చైర్మన్లుగా చావ రవి, జీ సదానందగౌడ్, వీ రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, లింగారెడ్డి, నాగిరెడ్డి, మణిపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నారు. పెండింగ్ డీఏల విడుదల, బిల్లుల చెల్లింపు, సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్‌ను ప్రకటించాలని మొత్తం గా 42 డిమాండ్స్‌ను ప్రభుత్వం ముం దుంచారు. అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాంను సన్మానించారు.

## మండలానికో ఎంఈవో

**సీనియర్ హెచ్ఎంలకు అదనపు బాధ్యతలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని మండలాలకు ఎంఈవోలను నియమి స్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. సీనియర్ హెచ్ఎంకు ఎంఈవోగా అదనపు బాధ్యతలప్పగించింది. 2005లో చివరిసారిగా ఎంఈవోలుగా పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం 16 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలున్నారు. ఒక్కొక్కరికి ఐదు, ఆరు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా అదనపు బాధ్యతలప్పగించారు. ప్రతి మండలానికి ఎంఈవోను నియమించడాన్ని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. కొనసాగింపుగా ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూ పొందించి, పూర్తిస్థాయి పదోన్నతులు కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ కోరారు. ఎంఈవోల నియామకం ప్రాథమిక విద్యకు శుభపరిణామమని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి అభిప్రాయపడ్డారు.

**ఎంఈవోగా అమెరికాలో ఉన్న హెచ్ఎం**

అధికారుల నిర్లక్ష్యానికి ఖమ్మం జిల్లాలో జరిగిన ఎంఈవోల నియామక ఘటన నిదర్శనంగా నిలిచింది. సెలవుపై అమెరికాకు వెళ్లిన ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఎంఈవోగా పూర్తిబాధ్యతలు అప్పగించడం ఇప్పుడు విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

## కాళేశ్వర ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

కాళేశ్వరం, సెప్టెంబర్ 24: కాళేశ్వరం దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. మంగళవారం ఈవో కార్యాలయంలో ఆలయ అభివృద్ధి, సరస్వతీ పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## డీఎస్సీ 2008 అభ్యర్థులకు తీపికబురు

- 2,367 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలు
- 27 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఉత్తర్వులు విడుదల చేసిన విద్యాశాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 అభ్యర్థులకు క్యాబినెట్ నిర్ణయం మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,367 మంది అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 5 వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందని, ఉమ్మడి జిల్లాల వారీగా కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలకు ఒప్పుకుంటున్నట్టు సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలోనే సమ్మతిపత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు 2008 డీఎస్సీలో 30 శాతం కోటాతో నష్టపోయిన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవోలకు పంపినట్టు పేర్కొన్నారు. వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనూ పొందుపరిచినట్టు తెలిపారు. నేటికి తమ 14 ఏండ్లనాటి కల నెరవేరనున్నదని డీఎస్సీ- 2008 మెరిట్ బీఈడీ క్యాండిడేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు సంగమేశ్వర్, చంద్రశేఖర్, రమేశ్, డీఎస్సీ-2008 సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ తదితరులు తెలిపారు.

- హైదరాబాద్ మినహా మిగతా ఉమ్మడి జిల్లాల్లోని డీఈవోల ఆధ్వర్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగనున్నది.
- డీఈవోలు ఎవరెవరికి ఉద్యోగాలు ఇవ్వవచ్చో, ఎవరికి ఇవ్వరాదో సూచిస్తూ అక్టోబర్ 6న నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

## రాష్ట్ర ఉత్సవంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాధన పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27న లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఉత్సవంగా నిర్వహించాలని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు విజ్ఞప్తిచేశారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించించారు. అలాగే వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిశ్చయించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 26న ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు.

## దర్శనం మొగిలయ్యకు ఇంటి స్థలం

**ధ్రువీకరణ పత్రం అందజేత**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో 600 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. ఇందుకు సంబంధించిన స్థల ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం మొగిలయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు.

# డీఎస్సీ ఫలితాలపై సస్పెన్స్

- ఫైనల్ కీ అభ్యంతరాలపై తేల్చని విద్యాశాఖ
- త్వరగా తేల్చాలని అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాల విడుదలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. ఫైనల్ కీ అభ్యంతరాలపై విద్యాశాఖ ఏదీ తేల్చడంలేదు. ఇప్పటివరకు జనరల్ ర్యాంకింగ్ జాబితా సైతం విడుదల కాలేదు. 6న పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ తుది 'కీ'ని విడుదల చేయగా, 210కి పైగా అభ్యంతరాలొచ్చాయి. అభ్యర్థులు పలు పుస్తకాల్లోని ఆధారాలతో సహా అభ్యంతరాలను అధికారుల ముందుంచారు. వాటిని విద్యాశాఖ అధికారులు ఎస్సీఈఆర్టీ పరిశీలనకు పంపించారు. దీంతో కథ మొదటికొచ్చింది. డీఎస్సీ మార్కులకు టెట్ మార్కులు కలిపి ఫలితాలు విడుదల చేయాల్సి ఉంది. అయితే టెట్ మార్కుల అప్‌లోడింగ్, సవరణకు విద్యాశాఖ అవకాశమివ్వగా దీంట్లోనూ పలు తప్పిదాలు వెలుగుచూశాయి. సాంకేతిక సమస్యలతో కొంతమందికి కొత్త మార్కులు అప్‌లోడ్ చేసినా పాతవే ప్రత్యక్షమయ్యాయి. ఒక సబ్జెక్టుకు పరీక్షరాస్తే మరో సబ్జెక్టు వెబ్‌సైట్‌లో చూపించింది. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సీఈఆర్టీ సబ్జెక్టు నిపుణులు అభ్యంతరాలపై ఓ నివేదికను రూపొందించి విద్యాశాఖ అధికారులకు సమర్పించినట్టుగా తెలిసింది. అయితే దీనిపై ముందుకెళ్లాలా..లేక ఇప్పటికే ప్రకటించిన తుది 'కీ' ప్రకారమే నడుచుకోవాలా..? అన్న విషయంలో విద్యాశాఖ ఏదీ తేల్చుకోలేకపోతున్నది. దీంతోనే ఫలితాలపై సస్పెన్స్ కొనసాగుతున్నట్టుగా తెలుస్తున్నది.

**ఆందోళనలో లక్షలాది అభ్యర్థులు**

డీఎస్సీ ఫలితాలపై విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నది. ఫైనల్ 'కీ' విడుదల చేసి 20 రోజులుదాటినా ఇంతవరకు ఫలితాలు విడుదల చేయకపోవడం ఆందోళనకరం. ఫైనల్ 'కీ' తప్పులపై క్లారిటీ ఇవ్వకపోవడంతో లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. వెంటనే జీఆర్ఎల్‌ను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేయాలి.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎల్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## భట్టీ బ్రదర్స్.. వర్గీకరణపై వైఖరేమిటి?

- స్పష్టం చేయకుంటే ఇండ్లను ముట్టడిస్తాం
- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి.. ఎస్సీ వర్గీకరణపై తమ వైఖరిని తక్షణమే స్పష్టంచేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీ చెన్నయ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మాల సామాజికవర్గాలు అభివృద్ధి చెందాయనే తప్పుడు ప్రచారాన్ని చేసి, వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకొచ్చారని, వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వర్గీకరణతో మాలలు అధికంగా నష్టపోతారని పేర్కొన్నారు. మంత్రివర్గ ఉప సంఘానికి బదులు సిట్టింగ్ జడ్జితో కమిటీని ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం నుంచి మాల ప్రజాప్రతినిధులు వెంటనే తప్పుకొని, వారి వైఖరిని వెంటనే ప్రకటించాలని, లేకుంటే మాలల ద్రోహులుగా ప్రకటించి వారి ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కులగణనకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని స్వయంగా ఏఐసీసీ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారని, మందకృష్ణ మాదిగకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని ఒప్పించి కులగణనకు ఒప్పించాలని డిమాండ్ చేశారు.

# 30 నుంచి ఓటరు నమోదు

- మార్చిలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ సీట్లు
- ఎన్నికల అధికారులతో సీఈవో సుదర్శన్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఓట రు జాబితా రూపొందించే ప్రక్రియ ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. వచ్చే మార్చి 29తో రాష్ట్రంలో మూడు ఎమ్మె ల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జి ల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లా ల టీచర్ ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవ్వనున్నాయి. ఈ నెల 30వ తేదీ నుంచి ఓటరు నమోదు ప్రారంభంకానున్న నేపథ్యంలో సీఈవో సీ సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఓటరు నమోదు షెడ్యూల్**

| | |
| --- | --- |
| నమోదు ప్రక్రియ ప్రారంభం: | సెప్టెంబర్ 30, 2024 |
| నమోదుకు చివరి తేదీ: | నవంబర్ 6 |
| ముసాయిదా ఓటరు జాబితా: | నవంబర్ 23 |
| జాబితాపై అభ్యంతరాల స్వీకరణ: | నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 |
| ఓటరు తుది జాబితా ప్రచురణ: | డిసెంబర్ 30, 2024 |

## డ్రగ్స్ బారిన పడకండి : జూనియర్ ఎన్టీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తాత్కాలిక ఆనందాల కోసం డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశాన్ని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, క్షణికమైన ఒత్తిడి, సహచరుల ప్రభావం వల్ల డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని సూచించారు. జీవితం అన్నింటి కంటే విలువైనదని, డ్రగ్స్ రహిత సమాజం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# 46 జీవోపై క్యాబినెట్ సబ్‌కమిటీ ఎక్కడ?

## 60 రోజుల రిపోర్టు.. 6 నెలలైనా రాలె!

- హైకోర్టులో తమ గొంతునొక్కారని అభ్యర్థుల ఆవేదన
- సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో బాధితులు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అరవై రోజుల్లో ఇస్తామన్న క్యాబినెట్ సబ్‌కమిటీ రిపోర్టు ఆరు నెలలైనా రాలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నం.46ను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు హోరెత్తించారు. మమ్మల్ని రెచ్చగొట్టి ఆందోళనలు చేయించారు. కొందరు కాంగ్రెస్ నేతలు ఇందిరాపార్క్ దగ్గర దీక్షలు కూడా చేపట్టారు. మేమున్నామంటూ కపట ప్రేమను నటించారు. ఎన్నికల్లో మాతో, మా కుటుంబసభ్యులతో ఓట్లు వేయించుకొని.. గెలిచి, అధికారంలోకి వచ్చాక మమ్మల్ని నట్టేట ముంచారు. కాంగ్రెస్ అంటేనే కమిటీలతో కాలయాపన' అంటూ జీవో 46 బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతిపెద్ద ప్రణాళికతో హైకోర్టులో తమ పిటిషన్‌ను కొట్టివేసేలా పావులు కదిపిన నేతలు.. రేపు ఏ ముఖం పెట్టుకొని పంచాయతీ ఎన్నికల్లో ఓటు అడుగుతారో చూస్తాం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో అత్యధిక మార్కులు వచ్చిన తమకు ఉద్యోగం ఇవ్వకుండా జీవోను అడ్డంపెట్టుకొని టీజీఎల్‌పీఆర్బీ చైర్మన్ తమను నట్టేట ముంచాడని ఆరోపిస్తున్నారు. తమకు హైకోర్టులో న్యాయం జరగకపోవడంతో.. సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్టు తెలిపారు.

**ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత..**

జీఓ నం.46ను రద్దు చేయాలి. టీఎస్ఎస్పీలో కానిస్టేబుల్ పోస్టులకు తెలంగాణ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ 2023 జూలై 19న ఇందిరాపార్క్‌లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దీక్షకు పిలుపునిచ్చింది. ఆ దీక్షకు సహకరించిన ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సహా కాంగ్రెస్ నేతలందరూ ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని బాధిత అభ్యర్థులు వాపోతున్నారు. జీవో 46పై క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుచేసి వారికి న్యాయం చేస్తామని, పాలనాపరంగా, చట్టపరంగా నిపుణుల సూచనలు తీసుకొని జీవోకు సంబంధించిన ఇబ్బందులను అధిగమిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని అంటున్నారు. క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పడి ఆరు నెలలు గడిచినా.. ఒక్కసారి కూడా తమ సమస్యలపై చర్చ జరపలేదని, వివరాలు తీసుకోలేదని.. ఈ కమిటీతో ఇంతవరకూ తమకు న్యాయం జరగలేదని విమర్శిస్తున్నారు.

**వరస వాయిదాలు కోరిన ఏజీ..**

టీజీఎల్‌పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆడిన ఆటలో నాటి ప్రభుత్వం, గ్రామీణ ప్రాంత అభ్యర్థులు మోసపోయారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని రూ.18 లక్షలు ఖర్చుపెట్టి 8 నెలలుగా పోరాడితే.. ప్రభుత్వం తెలివిగా ఆ కేసును కొట్టివేసేలా వాదించాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర అడ్వకేట్ జనరల్ వరుసగా వాయిదాలు కోరారని వివరించారు. కోర్టు స్టే ఆర్డర్‌ను ధిక్కరించి ఫలితాలు వెల్లడించారని తెలిపారు. దీనిపై మంత్రులకు, డీజీపీకి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని అన్నారు. తాము కోర్టుకు వెళ్లిన తర్వాతే జీవో 40 కాపీని టీజీఎస్‌పీఆర్బీ వెబ్‌సైట్‌లో పెట్టారని చెబుతున్నారు. రిజల్ట్ రాకముందు రూ.50 వేలు పెట్టి కోర్టుకు వెళ్తే.. వారు స్టే ఆర్డర్ ఇచ్చారని, అయితే.. దాన్ని కూడా ధిక్కరించి రాత్రికి రాత్రే.. ఫలితాలు విడుదల చేశారని మంత్రులు ఇప్పటికైనా ఖాళీగా ఉన్న రెండు వేల పోస్టులను తమతో భర్తీ చేయాలని కోరుతున్నారు. అందుకోసం సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమతో ఉద్యమం చేయించిన కాంగ్రెస్ నేతలు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు. న్యాయం చేయకపోతే.. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.